# బొమ్మల చొక్కా

## — పంతుల జోగారావు

"ఛీ! నాకీ చొక్కా వొద్దు...!"

బళ్ళోంచి వొస్తూనే, బొత్తాలు విప్పి చొక్కాని విసురుగా ఓ మూలకి విసిరేస్తూ గట్టిగా అరిచాడు నారాయణ.

వాడి మాటలకి గైరమ్మ విస్తుపోయింది. చేతిలో పని అలా వదిలేసి వాడి ముఖంలోకి వింతగా చూస్తూ వుండిపోయింది. పొద్దున్న కళకళలాడుతూ కొత్త చొక్కా తొడుక్కుని దర్జాగా సంబరంతో బడికెళ్ళిన కొడుకు ధుమధుమ లాడుతూ రావడం ఆమెకి ఆశ్చర్యాన్ని కలిగించింది. కొత్త చొక్కా వేసుకోబోతున్న ఆనందంతో వాడికి ముందు రోజు రాత్రి నిద్ర కూడా సరిగా లేదన్న సంగతి గైరమ్మకి గుర్తుంది. రోజూ కన్నా పెందలాడే నిద్రలేచి పోయి, స్నానం అదీ చేసి ముస్తాబయిపోయేడు. పసుపు పెట్టిన కొత్త చొక్కా వేసుకున్నాక వాడి ముఖం ఆనందంతో వెలిగిపోయింది. చల్ది మెతుకులు గబగబా నోట్లో కుక్కుకుని హుషారుగా చాలా ముందుగానే బడికి బయలుదేరి పోయాడు. అలాంటిది–బడి నుంచి వొస్తూనే చిరాకుపడిపోవడం–ముచ్చటపడి కుట్టించుకున్న కొత్త చొక్కా మూలకి గిరాటు వేసెయ్యడం చూసి గైరమ్మకి వాడి ప్రవర్తన ఏమీ అర్థం కాలేదు.

నులక మంచం నేస్తూ కూచున్న కొండయ్య పరిస్థితీ అలాగే వుంది. కొడుకు ముఖం ఎందుకో చిటపటలాడిపోతోంది. రోజూ బడి నుంచి యింటికి వచ్చేటప్పుడు వాడి ముఖంలో కనిపించే హుషారు యివాళ మచ్చుకయినా కనిపించడం లేదు.

'అయ్యా, బొమ్మల చొక్కా కొని పెట్టవూ?' అంటూ చాలా రోజులుగా తనని వేధించుకు తిన్నాడు. డబ్బులు జత పడక అదిగో యిదిగో అంటూ తను వాయిదా వేస్తూ వచ్చేడు. ఒక్కో రోజు కోపం వచ్చి అలిగి అన్నం తినడం మానేసి పడుకునేవాడు నారాయణ. ఒకటి రెండు సార్లు కొత్త చొక్కా కోసం ఏడ్చి తన చేత తన్నులు కూడ తిన్నాడు.

బొమ్మల చొక్కా తొడుక్కోవాలనే కొడుకు ముచ్చట చూసి పదీ పరకా దాచి ఎలాగయితేనేం కొత్త చొక్కా కుట్టించేడు తను. కొత్త బొమ్మల చొక్కా కుట్టించి తను యింటికి తెచ్చినపుడు వాడి సంతోషం అంతా యింతా కాదు. వెర్రి సంతోషంతో యిల్లంతా లేడిపిల్లలా ఎగిరి గంతులు వేసాడు.

గైరమ్మ నాలుగయిదు యిళ్ళలో పాచిపనుల చేస్తూ వుంటుంది. అప్పుడప్పుడు వాళ్ళూ వీళ్ళూ ఇచ్చిన పాత చొక్కా నిక్కర్లతోనే నారాయణకి గడుస్తోంది. ఆ చిరుగులు పట్టిన పాత బట్టలు వొంటి మీద ఒదులుగా వేలాడుతూ వుంటే యిష్టం లేకపోయినా వాటితోనే కాలక్షేపం చెయ్యక తప్పలేదు వాడికి. కూలిపనిచేసి తను తెచ్చేది కూటికే చాలడంలేదు. ఇక కొడుక్కి కొత్త బట్టలేం కొనిపెడతాడు?

చాలా రోజులుగా–ఉన్న రెండు చొక్కాలూ బాగా చిరుగులు పట్టేయని కొడుకు ఏడుస్తూ వుంటే వాడి బాధ చూడలేక ఎలాగయితేనేం ఓ కొత్త చొక్కా కుట్టించి యివ్వడానికి సిద్ధపడ్డాడు.

కొత్త చొక్కా కొని పెడతానని తను అనగానే ఏనుగెక్కినంతగా సంబరపడిపోయేడు నారాయణ. తన మెడ చుట్టూ చేతులు వేసి నడ్డి మీదకి ఎగబాకుతూ 'ఓరయ్య...మరయితే నాకు బొమ్మల చొక్కా కొనియ్యాల...ఏం?' అనడిగేడు మురిపెంగా.

బొమ్మల చొక్కా అంటే వాడికున్న మోజు చూసి ముచ్చట వేసింది తనకి. ఆ తర్వాత వాడు రోజూ కొత్త బొమ్మల చొక్కా గురించి అడగడమే...

గైరమ్మ తను పనిచేసే యిళ్ళ వారి నడిగి అడ్వాన్సుగా కొంత డబ్బు తెచ్చింది. ఈలోగా కూలి డబ్బుల్లోంచి అతి కష్టం మీద మిగిల్చిన డబ్బులు వాటికి జత చేసి ఎలాగయితేనేం నారాయణ కోరిక యిన్నాళ్ళకి తీర్చగలిగేడు.

ఉదయం బడికి బయలుదేరుతూ బొమ్మల చొక్కా వేసుకుని 'అయ్యా, ఎలా వుంది?' అంటూ వెలిగిపోతున్న ముఖంతో తన ఎదరకి వచ్చి అడిగేడు.

ఆ కొత్త చొక్కాలో నారాయణని చూసి నిజానికి తనక్కూడా ఎంతో సరదా వేసింది. నిక్కరు పాతదేఅయినా కొత్త బొమ్మల చొక్కా తళతళ మెరిసిపోతూ వుండడంతో ఆ సంగతి మరుగునపడిపోయింది.

డబ్బు కట్టల బొమ్మలతో ఆ చొక్కా వింతగా చూడ్డానికి ఎంతో బాగుంది. పదులు, యాభైలు, వందలు కట్టలు కట్టలుగా బొమ్మల రూపంలో ఆ చొక్కా నిండా కనిపిస్తున్నాయి.

బట్టల కొట్టువాడు ఎన్నో రకాల బొమ్మల తాన్లు చూపించినప్పటికీ తనకి డబ్బు కట్టల బొమ్మలు ముద్రించిన యీ

30–4–93 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

బట్టే ఎంతో నచ్చింది.

'వేంకిల డబ్బంతా నీ వొంటి మీదే వుందిరయ్యా...' నవ్వుతూ నారాయణతో అన్నాడు తను.

ఆ మాటలకి కొడుకు ఉప్పొంగి పోయేడు. నడుస్తున్న బ్యాంకులా మహా గర్వంగా యిల్లంతా కలయతిరిగేడు.

'నా బిడ్డ రాజా! ఆడికేటి...పెద్దయితే యిలపింటి నోట్ల కట్టలు జేబిల నిండా వుంటాయి. ఉప్పుడు డబ్బు కట్టల కొత్త జుబ్బా ఏసుకుంతాడు...అప్పుడు నోట్ల కట్టలు యినప్పెట్టిల నిండ మనకి సంపాయించి యిస్తడు..." గైరమ్మ పొంగిపోతూ అంది.

ఆ మాటతో నారాయణకి మరీ సంతోషం వేసింది. లోకంలో డబ్బంతా ఆ క్షణంలో తనొక్కడి స్వంతమే అయిపోయినట్టు ఉప్పొంగిపోతూ తుళ్ళుతూ బడికి పరిగెట్టాడు.

'బళ్ళోంచి వొచ్చేక ఆడికి దిష్టి తియ్యాలే'

'అవును...నానూ అదే అనుకుంతన్నాను...' కొడుకు వెళ్ళిన వేపే ఆపేక్షగా చూస్తూ అంది గైరమ్మ.

అంత ఆట్టహాసంగానూ, సంతోషంగా బడికి వెళ్ళిన నారాయణ యింటికి జావకారి పోయినట్టు రావడం వాళ్ళకి మతిపోయినట్టు చేసింది.

కొంచెంసేపు ఆ యిద్దరూ ఏమీ మాట్లాడలేక పోయేరు.

ఎంతో అపురూపంగా కుట్టించుకుని తొడుక్కున్న బొమ్మల చొక్కా వాడికి అంతలోనే చేదు విషంలా ఎందుకు మారి పోయిందో వాళ్ళకి అర్థం కావడం లేదు.

నారాయణ కళ్ళలో పెల్లుబుకుతున్న కన్నీటిని చూసి వాళ్ళు చలించిపోయేరు.



చింకి చొక్కా తొడుక్కో. కొత్త పుస్తకం కొనుక్కో

– చైనా సామెత

కొండయ్య నారాయణ దగ్గరకి వెళ్ళి చేత్తో తల నిమురుతూ లాలనగా అడిగేడు: "ఏటయింద్ర... అసలేటి జరిగినాది పెద్ద..." అని.

'మీ అయ్య దీన్ని తెచ్చినపుడు సేన బాగుందని తెగ సంబరపడనేదా! పెందిల దాన్ని ఏసుకుంటూ, అబ్బాసి, ఓ ఎలుగు ఎలిగిపోనేదా!...అలపింటిది...మరి ఉప్పడేటి యిలా...ఆ బొమ్మల చొక్కా వొద్దంటే వొద్దని యిసిరి కొడుతున్నావురొరే... ఇదేం సొద్దెమోలయ్యా...' గైరమ్మ కళ్ళు పెద్దవి చేసుకుంటూ అడిగింది నారాయణని.

వాడు తలెగరేసి వాళ్ళవేపు దుఃఖంతో ఉబ్బిపోయిన కళ్ళతో చూసాడేకాని, వాళ్ళ ప్రశ్నకి జవాబు మాత్రం చెప్పలేదు.

ఏం జరిగిందో తెలుసుకుందామని కొండయ్య, గైరమ్మలు వాణ్ణి నయానాభయానా అడిగి చూసేరు. కాని లాభం లేకపోయింది. మోకాళ్ళలో ముఖం దాచుకుని ఓ మూల చేరి ఏడుస్తూ వుండిపోయేడు. వాడు మరింక ఆ కొత్త బొమ్మల చొక్కా వేసుకోడని తేలిపోయింది.

తనకి ఆ చొక్కా కుట్టించడం కోసం తల్లీ తండ్రీ దాదాపు నెల రోజులుగా ఒక్కపూటే తిండి తిన్నారని వాడికి తెలీదు.

అలాగే–

ఆ రోజు బళ్ళో మేస్టరు కొత్త పుస్తకం ఎందుకు యింకా కొనలేదని నారాయణని అడిగితే 'మా కాడ డబ్బులునేవండీ' అని నారాయణ బదులు చెప్పేడనీ–

'రాస్కెల్...నీ చొక్కానిండా డబ్బేరా! పుస్తకం కొనడానికి మాత్రం డబ్బులు లేవూ?' అంటూ వెటకారంగా తిడుతూ బెత్తంతో యిష్టం వచ్చినట్టు మేస్టరు నారాయణని చితక బాదేడనీ–ఆ తల్లిదండ్రులకి తెలీదు. చొక్కా మోజులో పుస్తకం కొనుక్కోవాల్సి వుందని వాడు యింట్లో చెప్పనే లేదు.

ఆ మర్నాడు చిరిగిపోయిన పాత చొక్కా వేసుకుని బడికి బయలుదేరాడు నారాయణ.

అప్పుడు వాడు నడుస్తున్న బ్యాంకు లాగా కాక–చిరిగిపోయిన రూపాయి నోటులాగానో, చెల్లని సత్తు నాణెంలాగానో వున్నాడు.

◆